




# కోడి

వీరభద్రరావ్ పచ్చి



మహంకాళమ్మ జాతర బ్రహ్మాండంగా సాగిపోతోంది. మధ్యాహ్నం మొదలైన అమ్మవారి ఊరేగింపు రాత్రి పన్నెండు గంటలకు చెరువుగట్టునున్న జమ్మిచెట్టు దగ్గరకు చేరుకుంటుంది. మొక్కులు తీర్చుకునే వాళ్ళు, ఆనవాయితీ వున్నవాళ్ళు గొర్రెల్ని, మేకల్ని కోళ్ళను బలి యిస్తారు.

తాగిన వాళ్ళు గంతులేస్తున్నారు. ఘటాలు ఎత్తుకున్న వాళ్ళు వీరశైవుల్లా ఆడుతున్నారు. డప్పుల మోత, ఊరంతా వినబడుతోంది. చాకలి యీరమ్మ ఒంటిమీదకి అమ్మోరొచ్చింది. చిందులు తొక్కుతోంది.

* * *


ధర్మరాజుగారు తాగలేదు.

కాని గంతులేస్తున్నారు.
ఆయన ఘటం ఎత్తుకోలేదు.
అయినా కోపంతో ఆడుతున్నారు.
ఆయన ఒంటి మీదకి 'అమ్మోరు' రాలేదు.
అయినా చిందుల్తొక్కుతున్నారు.
సుబ్బడు వచ్చి ఎదురుగా నిలబడ్డాడు.
వాడి మొహం చూడగానే ఆయనకి విషయం అర్థమైపోయింది.
అయినా "ఏరా ఏమైంది?" అన్నాడు.
"దొరకలేదండి" నీళ్ళు నముల్తూ అన్నాడు.
"సీ-దరిద్రపు తొత్తుకొడకా!"
"ఊళ్ళో జాతర కదండి. ఎవరి దగ్గరా కోళ్ళు లేవండి."
సుబ్బడు సంజాయిషీ ఇచ్చాడు.
"నువ్వో దరిద్రపు ఎదవ్వి—నువ్వొస్తే పెట్ట కడుపులో గుడ్డు లోపలే సచ్చిపోద్ది."
ధర్మరాజుగారు అన్నమాటలకి సుబ్బడు అమాయకంగా నవ్వాడు.
తిరిగి ఏదేనా అనడానిక్కావల్సిన అర్హతలు వాడి దగ్గరలేవు.
పుట్టింది మాలపుట్టుక—చేసేది పాలేరు తనం.
డబ్బున్నవాడు అనడం - లేనివాడు పడటం.
ఉన్నవాడు తన్నడం—లేనివాడు తినడం.
ఈ దేశంలో అనాదిగా వస్తున్న ఆచారం.
మిగతా దేశాల్లా జనానికి తిరుగుబాటు నేర్పిన ఆకలి — ఈ దేశానికి బానిసత్వం నేర్పింది.
"సెంద్రిని పిలు."
ధర్మరాజుగారు హుకుం జారీచేసారు.
సుబ్బడు అక్కణ్నించి కదిలాడు-అతనికి మనసులో బాధగా అనిపించింది. చంద్రి ఆ ఇంట్లో పనిమనిషి - ఆమె మాలయువతే. కాబట్టి ఇంట్లోకి రాకుండా దొడ్లో ఊడ్వటం, నీళ్ళు జల్లడం, గొడ్లసాలలో పనులు చూడటం చేస్తుంది.
"ధర్మరాజుగారి ఇంటికి వెనకవైపు ఓ చాలగా గొడ్లసాల వుంది. అటుగా వెడుతూ ...పం దాసుగాడు" అనుకున్నాడు సుబ్బడు.

* * *

ధర్మరాజుగారు ధర్మాపురానికి చాలా ఏళ్ళుగా ప్రెసిడెంట్‌గా వుంటున్నారు.
ఆయనకా వూళ్ళో ఏభై ఎకరాల మాగాణి వుంది.
పెద్ద మేడుంది.
ఒంటినిండా కామం వుంది.
చూపుల్లో అహంకారం ఉంది.
మీసంలో పొగరుంది.
అంతేకాదు—భర్త సుఖంకోసం రోజూ తులసికోట దగ్గర పూజచేసే భార్యుంది.
ఎం.ఏ. పాసైన కూతురుంది.
ధర్మరాజుగారి కెదురు చెప్పి, ఆ ఊళ్ళో ఎవరూ నిలబడలేరు.
ఆయన కళ్ళెర్రజేస్తే కాకులు అరవ్వు. గేదెలు పాలియ్యవు. ఆవులు గడ్డితినవు. కుక్కలు మొరగవు.
ప్రాణుల్లోకెల్లా ఎక్కువ ప్రాణభీతికల జాతి మనుసులు. వాళ్ళసలు ఆయనకు ఎదురుతిరిగే ప్రయత్నమే చెయ్యరు.
ఆయనతో సంబంధం వున్న నర్సు భాగ్యమ్మను డ్యూటీ సరిగా చెయ్యమన్న నేరానికి ఆ వూరి డాక్టర్‌ని శ్రీకాకుళం అడవుల్లో వేయించిందాయనే.
భవిష్యత్తులో సంబంధం పెట్టుకోవచ్చన్న ధీమాని కలిగించిన టీచర్ జ్యోతిని తన వూరు వేయించుకున్నదీ ఆయనే!
ఆ వూళ్ళో హరిజన కుటుంబాలు చాలా వున్నాయి. వాళ్ళ ఒంటినిండా గుడిసెల్నిండా దరిద్రముంది—వాళ్ళ ఉద్ధరణ పేరిట వాళ్ళ గూడెంను ఊరికి దూరంగా కట్టించి అంటరానితనాన్ని మరింత పెంపొందింప చేశారు పెద్దలు.
ధర్మరాజుగారిక్కెదురు తిరిగిన కోటేశు ఎందుక్కనిపించకుండా పోయాడో వాళ్ళకి తెలుసు. పాపడి పెళ్ళాం గవరమ్మను ఆయన పొలం గట్టున బలాత్కారం చెయ్యబోతే పంట చెరువులో దిగి చచ్చిపోయిందన్న విషయం వాళ్ళకి తెలుసు.
అయినా వాళ్ళేమీ చెయ్యలేదు ధర్మరాజుగార్ని.






దరిద్రం మనిషిలో భయాన్ని పుట్టిస్తుంది.
అవసరం మనిషిని బలహీనుణ్ణి చేస్తుంది.
ధర్మరాజుగారికున్న ఒక్కగానొక్క కూతురు భారతి....
ఆమెకు చదువంటే చిన్నప్పట్నుంచి శ్రద్ధ ఎక్కువ. ఆమె కేవలం డిగ్రీలకోసం కాకుండా విజ్ఞానం కోసం చదువుకుంది. ఆమెకు నిర్దుష్టమైన సాంఘిక, రాజకీయ అవగాహన వుంది.
తన తండ్రి సాగిస్తున్న హిరణ్యాక్ష పరిపాలనను ఆమె అర్థంచేసుకుంది. ఆ విషయమై బాధపడింది. ఏమీ చెయ్యలేని తన నిస్సహాయత తను తానే అసహ్యించుకుంది
ఆమె ఎం.ఏ. చదువుతుండగా తనతో చదువుకునే వెంకట్రావనే కుర్రాడితో మనసు కలిపింది. అతన్ని పెళ్ళి చేసుకుందామనుకుంది. ఇంటికొచ్చి తండ్రికి చెప్పింది.
ధర్మరాజుగారు "అడి కులమేంటి?" అన్నారు.
"ఆడి ఆస్తిపాస్తులేటి" అన్నారు.
అన్నీ విని "నిన్ను సదివించడం నాదే బుద్ధి తక్కువ" అన్నారు. అని వూరుకోలేదు. "నోరు మూసుకుని ఇంట్లో పడుండు. నెత్తి మీద సొంత వెంట్రుకలు లేనోడికి, అందులో తక్కువ కులపోడికి నిన్నిచ్చి ఎట్టా సేస్తాననుకున్నావ్" అన్నారు.
"అతనికి కులానికి ఆస్తికి మించిన విలువైన విజ్ఞానం ఉంది నాన్నా-అతని సంస్కారానికి మించిన సంపద నాకొద్దు నాన్నా."
అని చెబ్దామనుకుంది భారతి.
చెప్పలేదు. చెప్పినా అర్థంకాదన్న విషయం ఆమెకు తెల్సు.
ధర్మరాజుగారు ఏ పరిస్థితిని చెయ్యిదాటి పోనివ్వరు. వారం తిరక్కుండా ఆస్తిపరుడైన అల్లుణ్ణి కుదుర్చుకొచ్చేరు.
తనక్కాబోయే భర్త ఆస్తివున్నా అక్షర

జ్ఞానం లేనివాడని తెల్సినప్పుడు భారతి బాధ పడింది.

"చదువు లేకపోయినా సంస్కారం వున్న వాళ్ళు ఎంతమంది లేరు?" అని సమాధాన పరుచుకుంది.

"నన్ను ప్రేమగా చూసుకుంటే 'చాలు'" అని ఆశపడింది.

పెళ్ళయి నెల తిరక్కుండానే భారతికి భర్త పూర్తిగా అర్థమైపోయాడు. ఆమె తండ్రి ఎలా ధర్మరాజు కాడో, ఆమె భర్త రామరాజు అలాగే శ్రీరామచంద్రుడు కాడు. అతను సర్వగుణాభి రాముడు.

అతనికి తెల్లారేసరికి రెండు సీసాలు కావాలి.

పొద్దు కూకేసరికి ఓ అమ్మాయి కావాలి.

ఆమె కాపురానికెళ్ళిన నెలకే డబ్బు తెమ్మని తన్ని పుట్టింటికి పంపేశాడు.

"నా జీవితం ఎందుకిలా తగలేసావ్?" అని ఆమె కనిపించని దేవుణ్ణి అడగలేదు-కనిపించే తండ్రినే అడిగింది.

ఆయన ఏ సమాధానమూ చెప్పలేదు.

తన అంచనా ఎందుకు తప్పిందా-అని ఆలోచించుకుంటున్నాడు:

రామరాజు డబ్బు అవసరం పడినప్పుడల్లా అత్తారింటికి వస్తాడు. డబ్బు తీసికెడతాడు తప్ప— భార్యను తీసికెడతానని అనడు.

ఇన్నాళ్ళూ ఊరిని గడగడలాడించిన ధర్మ రాజుగార్ని అల్లుడు గడగడలాడించేస్తున్నాడు.

అల్లుడు ఆయనకో సమస్యైపోయాడు.

ఇంటికి రమ్మంటే తప్పు—రమ్మనకపోతే తప్పు.

కూతుర్ని ఎప్పుడు తీసుకెడతావంటే తప్పు ఎందుకు తీసుకెళ్ళవంటే తప్పు.

"ఈడు నా కూతురికి కాదు-నాకు మొగుడై కూర్చున్నాడు."

అని ఆయన చాలాసార్లనుకున్నారు.

ఆ రోజు మధ్యాహ్నం రామరాజు అత్తారింటికి వచ్చాడు.

ధర్మరాజుకి గుండెల్లో రాయి పడింది.

భారతికి మనస్సులో జుగుప్స నిండుకుంది.

"ఆడొచ్చాడంటే రెండేలకు కాళ్లొచ్చాయి" అనుకున్నారు ధర్మరాజుగారు.

"మనసుకి శాంతిలేకుండా పోతుంది" అనుకుంది భారతి.

అల్లుడు రావడం, కూతురు అల్లుడు ఘాటా మాటా అనుకోవడం, అల్లుడు ఆమెను నాల్గు తన్నడం అరగంటలో జరిగిపోయాయి.

మేడమీద జరిగే విషయాలేవీ తనకి తెలియ నట్టు అరుగుమీద కూర్చున్నారు ధర్మరాజుగారు.

మామకి అల్లుడి మీద కోపమొచ్చినా, అల్లుడికి మామమీద కోపమొచ్చినా నష్టపోయేది మామేనన్న సూక్ష్మం ఆయన గ్రహించారు. అలాగే నడుచుకుంటున్నారు.

అల్లుడంటే ఇష్టమున్నా లేకున్నా అతిథి మర్యాదలు సరిగా చెయ్యాలి. లేకుంటే "నన్ను పాలేరెదవలా సూస్తావ్రా?" అని మొహం మీదే అడుగుతాడు.

అడిగేసి వూరుకోడు. మరో రెండు వేలడుగుతాడు.

అల్లుడికి భోజనంలోకి కోడిని కొయ్యాలి. ఆ రోజు అమ్మవారి జాతర మూలంగా ఊరంతా మనుషుల్ని తిప్పినా కోడి దొరకలేదు. ఆయనకి చిరాకెత్తిపోతోంది."

"ఇదంతా నా ఖర్మ" అని చాలాసార్లనుకున్నారు ధర్మరాజుగారు.

* * *

ధర్మరాజుగారు అరుగుమీద కూర్చుని చుట్ట కాల్చుకుంటున్నారు. రామరాజు మేడమీద గదిలో ఒంటరిగా కూర్చుని రమ్ముసీసాతో మాట్లాడుకుంటున్నాడు. భారతి మరోగదిలో పడుకుని కళ్ళకు కనబడే తండ్రిని, కనబడని దేవుణ్ణి తిట్టుకుంటోంది.


సుబ్బడు అరుగుకింద ఓ మూల వినయంగాను, మరోమూల చంద్రి భయంగాను నిలబడివున్నారు.

"దాసుగాడు ఇంట్లో వున్నాడా?"

ధర్మరాజు నిశ్శబ్దాన్ని బద్దలు కొట్టాడు.

"లేడండి మునసబుగారి కోతపనికెళ్ళాడు"






తలొంచుకునే చెప్పింది.

"అల్లుడుగారొచ్చారు."

ఆ మాట వినేసరికి చంద్రికి ఒళ్ళంతా తేళ్ళూ, జెర్రులు పాకినట్టయ్యింది. అతను వచ్చినప్పుడల్లా తనకేసి చూసే ఆకలి చూపులు వేసే వెకిలి వేషాలు గుర్తొచ్చి ఆమె మనస్సు నిండా అసహ్యత నిండుకుంది.

"ఏం ఇంటన్నావా?" గద్దించినట్టు అడిగాడు ధర్మరాజుగాడు.

"సిత్తం-ఇన్నానండి!" ఆమె మాటల్లో వణుకు.

"ఊరంతా తిరిగినా కోడి దొరకలేదు. అది లేందే అల్లుడుగారు భోజనం సెయ్యరు. నువ్వింటికెల్లి పుంజునట్టుకురా - నీ మొగుడొచ్చాక కరీదెంతో కనుక్కుని డబ్బు లట్టుకుపో—"

అనుకున్నంతా అయ్యింది.

ఆమెకి మాట పెగల్లేదు.

ఆమె భర్త దాసు ఆ పుంజుని ప్రాణంలా చూసుకుంటాడు. పైగా అది పందెం పుంజు-ఆ సంవత్సరం రెండు పందాలు కొట్టి దాసుకి వెయ్యిరూపాయలు ఆర్జించి పెట్టింది. అది పిల్లగా వున్నప్పట్నుంచి దాసు దాన్ని కళ్ళల్లో వత్తులేసుకుని పెంచాడు. ఆ పుంజుని కూర కోసం కోసేశారని తెలిస్తే వాడిగుండె పగిలి పోతుంది. తన భర్త బాధపడటం ఆమె చూళ్ళేదు. వీల్లేదంటే ధర్మరాజుగారు యేం చేస్తారోనని భయం.

చంద్రి ఏం మాట్లాడలేదు.

"ఏం-చెప్పింది వినబడిందా?" ఆయన గొంతులో కోపం.

"మా మామ ఆ పుంజునియ్యడండి" ఆమె మాటల్లో భయం.

"ఆడిచ్చేదేంటి ఆడి బొంద-మర్యాదగా సెప్తే ఇన్రు మీరు."

రాజుగారి మాటల్లో అహంకారం.

"మీకు దణ్ణం పెడతానయ్యా-ఆ పుంజు జోలికి పోకండి, ఆడు పిచ్చోడైపోతాడు" చంద్రి బతిమాలింది.

"ఏడిశావ్-ఎదవ కబుర్లూ నువ్వూను. నేనేమన్నా ఊరికే ఇమ్మనాన్నా? ఒరేయ్ సుబ్బా! దానింటికెల్లి ఆ పుంజునట్టుకురా."

"మీ కాల్లకు దణ్ణం ఎడతానయ్యా-ఆ పుంజు నొదిలెయ్యండి."

చంద్రి కళ్ళల్లో నీళ్ళు.

"ఎర్రా ఎదవ నా కొడకా-పుంజునట్టుకురా-ఎవడడ్డొస్తాడో సూస్తాను"

సుబ్బడు బరువుగా కదిలాడు.

దాసు వాడికి చుట్టంకాదు. చంద్రీ కాదు, కాని వాళ్ళు తనలాగే....ఒకళ్ళ కింద పన్జేసుకు బతికేవాళ్ళు. సుబ్బడి ఇంటి యెదురుగా వుండే దాసు పుంజుని ఎలా ప్రాణంలా చూసుకుంటాటో అతనికి తెలుసు.

తన చేతుల్తో దాసుగుండె పగలగొట్టలేడు.

అలాగని రాజుగారి కెదురు తిరిగి తన బుర్ర పగులగొట్టించుకోనూలేడు.

సుబ్బడు అక్కణ్నుంచి కదిలేముందు చంద్రి కళ్ళల్లో నీళ్ళు చూశాడు. వాడికి మనసు కకావికలమైపోయింది.

"నీ ఎదవ బతుకు—లేని ఆస్తిపాస్తులు లేనేలేవు. ఉన్నోటిని దక్కించుకునే యోగం కూడా లేదు,''

సుబ్బడు మనసులో అనుకున్నాడు-కోడి కాలికున్న తాడు విప్పుతూ—

దాన్ని పొదివిపట్టుకున్నప్పుడు 'కొక్కొ-రోకో' అని గట్టిగా కూసింది పుంజు అతని కళ్ళల్లోకి చూస్తూ.

దాని కళ్ళల్లో అతనికి మూగవేదన కనిపించింది. చేతుల్లోంచి బైటపడటానికి విదిలించుకుంది. గట్టిగా పట్టుకున్నాడు.

'ఏ తల్లి కడుపులోంచి అది గుడ్డుగా బైటపడిందో—ఏ తల్లి కడుపుకింద పొదగబడి, భయంకరమైన పురిటిచావునుంచి తప్పించుకుని బైటపడిందో, ఏ తల్లి రెక్కల కింద దాక్కుంటూ, దాక్కుంటూ గింజలు, పురుగులు ఏరుకుతింటూ బతికిందో, ఎన్ని పాముల్నుంచి, ఎన్ని డేగల్నుంచి తప్పించుకుందో, ఏ ఆకాశంకింద, ఏ వెలుగురేఖల్లో, ఏ గాలి పీలుస్తూ పౌరుషాన్ని పెంచుకుందో, ఎన్నికోడిపెట్టల ప్రాకృతమైన కోర్కెలికి సమాధానం చెప్పిందో, ఎన్ని పుంజులమీద కత్తుల కాలు దువ్విందో—ఈవేళ నా చేతుల్లో ప్రాణాలు ఒదుల్తుంది.'

సుబ్బడికి మనస్సునిండా ఆలోచనలు....

"ఎన్ని పుంజుల్ని కొయ్యలేదు—ఈ వేళ ఎందుకిలా ఎర్రిగా ఆలోశిస్తన్నాను" అనుకున్నాడు వాడే.

సుబ్బడికి కోడిభాష రాదు.

వస్తే "చూడు—నిన్ను రచ్చించుకోవాలనుకోడం మా పాణాలమీదకి తెచ్చుకోడవ్వే—చమించు". అని చెప్దామనుకున్నాడు.

రాజుగారి ఇంటివెనకాలకి తీసికెళ్ళి పుంజుని కొయ్యాల్సి వచ్చినప్పుడు సుబ్బడి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. క్షుద్రదేవతకి స్నేహితుడి కొడుకుని బలి యివ్వాల్సి వచ్చినట్టు ఫీలయ్యాడు.

పుంజుకి రెండు చేతులతో దణ్ణంపెట్టాడు.

అటుగా వెడుతూ అది చూసిన రామరాజు నవ్వుతూ

"అదేవన్నా అమ్మోర్రేట్రా దణ్ణం ఎడతన్నావే ఎర్రినా కొడకా — తొందరగా కొయ్యరా" అన్నాడు.

పుంజు సుబ్బడి కళ్ళల్లోకి చూసింది.

ఈసారి దాని కళ్ళల్లో వేదన లేదు.

పౌరుషం ఉంది.

"ఛీ! పిరికిసన్నాసుల్లారా! మిమ్మల్ని మీరే రక్షించుకోలేరు నన్నేం రక్షిస్తారు? పెంచిన మీ కండలు పాలేరుతనం చెయ్యడానికి తప్ప ఇంకెందుకూ పనికిరావు. పక్కమనిషికి భయపడి మానం, అభిమానం చంపుకుని పొట్టకోసం బతుకుతారు. సిగ్గులేని బతుకులు మీవి-మీలాంటి వాళ్ళు బతికినా చచ్చినా పెద్ద తేడా లేదు—బానిసలు మీరు....

నేను చూడు—ఎప్పుడూ తోటి పుంజుకి భయపడి తలొగ్గలేదు. పందెంలో కత్తిదెబ్బ తిని చచ్చిపోడానికైనా సిద్ధమే .... కాని మరో పుంజుకి భయపడను—నాలా బతకండిరా!"

పుంజు తనను దేశించి అంటున్నట్టనిపించింది సుబ్బడికి—"ఛీ సీ యమ్మ........" హేళన భరించలేకపోయాడు.

కత్తి పైకెత్తాడు,

పుంజు యెగిరి సుబ్బడి మొహంమీద తన్ని పారిపోయింది.

సుబ్బడికి తల తిరిగింది. సంబాళించుకుని చూసేసరికి పుంజు చాలా దూరంగా వుంది.

దాన్ని పట్టుకోడానికి వెనకాలే పరుగెత్తాడు.

అది దొరక్కుండా పారిపోతోంది, వాడు పరుగెడుతూనే వున్నాడు.

పశువులశాలలోంచి కేకలు వినబడ్డాయి సుబ్బడికి.

కోడిని వదిలేసి అటుగా పరుగెత్తాడు.

అక్కడ గడ్డిమీద అసహాయంగా పొర్లుతూ చంద్రి—

ఆమె నోరు మూసేసి బలవంతంచేస్తూ రామరాజు.

వెళ్ళగానే రామరాజును గట్టిగా తన్నాడు సుబ్బడు.

అతనోపక్కగా పడ్డాడు—అతని కళ్ళల్లో క్రోధం.

బట్టలు సర్దుకుంటూ లేచి నిలబడింది చంద్రి.

ఆమె కళ్ళల్లో దీనత్వం—

"అడ్డొస్తావురా—నిన్ను సంపేత్తాను నంజికొడకా!"

రామరాజు మూలవున్న బాణాకర్ర ఎత్తి వస్తున్నాడు.

"సెంద్రీ! ఇక్కణ్నుంచి పారిపో—" సుబ్బడు గట్టిగా అరిచాడు.

ఆమె పారిపోతూ సుబ్బడి కళ్ళలోకి చూసింది.

సరిగ్గా అవే చూపులు........

కొన్ని నిముషాలక్రితం అతని అశక్తతని, చేతకానితనాన్ని — హేళనచేసిన కోడిపుంజు చూపులు—

రామరాజు కర్ర విసిరాడు.

సుబ్బడు తప్పించుకున్నాడు.

మనిషిచేతిలో చచ్చే కోడిలా కాదు—పందెంలో పుంజులా బతకాలి.

సుబ్బడి బుర్ర చురుగ్గా పన్జేసింది.

స్థంభానికి గుచ్చివున్న కొడవలి అందుకున్నాడు.

ఒక్కక్షణం........

రామరాజు అమ్మవారి జాతరలో బలియియ్యబడిన కోడిలా .... గిజగిజకొట్టుకుంటున్నాడు.

పందెం నెగ్గిన పుంజులా సుబ్బడు....

సుబ్బడు భయపడటంలేదు, కంగారుపడటంలేదు.

ఏంచెయ్యాలా అని ఆలోచిస్తున్నాడు.

"సుబ్బా!"

పిలుపికి సుబ్బడు అదిరిపోయాడు.

కంగారుగా చూశాడు.

తనవైపు వస్తున్న భారతి....

ఆమె ముఖాన్ని ఎర్రటిబొట్టు చూశాక తప్పు చేశానేమోనన్న అనుమానం కల్గింది.

"అమ్మాయిగారు....అసలు...."

"జరిగిందంతా నే చూశాన్రా—ఆ కొడవలి నా చేతికిచ్చి నువ్వీ వెనకాల్నుంచి వెళ్ళిపో!"

ఆమె చాలా ప్రశాంతంగా మాట్లాడింది.

"అమ్మాయిగారూ...."

"ఏం కంగారు పడకురా-నే చెయ్యలేని పని నువ్వు చేశావ్."

"నాన్నారిక్కి తెలిస్తే యింకేమన్నా వుందా అమ్మా...."

"నేనే చేశానని తెలుస్తుంది. ఏం చేస్తాడు. కన్నకూతురు. కడుపుతీపి....కడుపులోనే దాచుకుంటాడు నువ్వెళ్ళరా వెర్రాడా!"

"ఒద్దు అమ్మాయ్‌గారు—ఇది నే జేసిన పాపం....నేనే అనుభవించాలి."

"కాదు-ఇలా చెయ్యాపోవడం నే చేసిన పాపం. మా అత్తారింట్లో పన్జేసే పిల్లని ఈయన ఇలాగే....

నేను మాటల్తో అడ్డుచెప్పాను. అడ్డంపడ్డాను. వారించలేకపోయాను. అన్యాయాన్ని మాటల్తో అడ్డుకుని, అడవిమృగానికి నీతులు చెప్తే అర్థం కాదు—ఇలాగే జరగాలి —"

ఆమె మాటలు సుబ్బడికి అర్థంకాలేదు.

అక్కణ్నుంచి వెళ్ళిపోతూ దొడ్లోకి వచ్చాడు.

బాగా చీకటి పడింది.

సుబ్బడి చేతుల్నుంచి తప్పించుకున్న పుంజు గోడ ఎక్కి అప్పుడే తెల్లారినట్టు కొక్కొరోకో అని గట్టిగా కూసింది. □